క్లుప్తంగా

ఘనంగా పైడితల్లి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం


అమ్మవారిని దర్శించుకున్న నిర్వాహకులు, స్థానిక సంస్థల ప్రతినిధులు

సీతానగరం: మండలంలోని దయానిధిపురంలో మాజీ సర్పంచ్ వై.రాధాకృష్ణ కుటుంబీకుల ఆధ్వర్యంలో పైడితల్లి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వాహకులు వాసు,కోటేశ్వరరావు పర్యవేక్షణలో అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శ్రీరాములునాయుడు, అంటిపేట సర్పంచ్, ఎంపీటీసీ ఎస్.తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు వై.గోపాలనాయుడు, జానుమల్లువలస మాజీ సర్పంచ్ వై జగన్నాథం నాయుడు ఉన్నారు.

కందిపప్పు విడుదలైన వెంటనే పంపిణీ

- పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

సాక్షి ఎఫెక్ట్...

పార్వతీపురం రూరల్: మార్చి నెలకు సంబంధించి లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన కందిపప్పు ఇంకా విడుదల కాలేదని, ప్రభుత్వం కేటాయించిన వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నామని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం సాక్షి దినపత్రికలో ''పప్పన్న కరువాయె'' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందిస్తూ కేంద్రప్రభుత్వం కేటాయించిన కందిపప్పును ఇంతవరకు సరఫరా చేశామన్నారు. మార్చి నెలకు కావాల్సిన కందిపప్పు నిల్వలు ఇంకా విడుదల కాలేదని, విడుదలైన వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నామని తెలిపారు.

10 వ తరగతి పరీక్షలకు 10వేల 408 మంది విద్యార్థులు

- డీఈఓ తిరుపతినాయుడు


విలేకరులతో మాట్లాడుతున్న డీఈఓ తిరుపతి తనాయుడు

సాలూరు రూరల్: 10వ తరగతి పరీక్షలకు పార్వతీపురం మన్యం జిల్లాలోని 220 పాఠశాలల నుంచి 10వేల 458 మంది విద్యార్థులు హాజరవుతున్నారని డీఈఓ తిరుపతి నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మామిడిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాలల్లో 100రోజుల ప్రణాళికలో భాగంగా స్పెషల్ క్లాసులు నిర్వహించినట్లు చెప్పారు. పిల్లలకు ఉపాధ్యాయులు క్లాసులు చెప్పడంతో పాటు చదివిస్తున్నారని, అయితే ఇంటి దగ్గర తల్లితండ్రుల పర్యవేక్షణ కూడా ఉండాలన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన రాజన్నదొర


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: వైఎస్సార్‌సీపీ నాయకుడు, లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గొర్లె మధుసూదనరావు కుమారుడు గొర్లె పవన్ వివాహ మహోత్సవంలో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పాల్గొన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన వివాహమహోత్సవంలో పాల్గొని వధూవరులైన పవన్, మౌనిక భూషణ్‌లను ఆశీర్వదించారు. రాజన్నదొర వెంట పలువురు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఉన్నారు.

పశువులకు టీకాతో ఆరోగ్యం

- గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధులు రాకుండా నివారణ


పశువులకు టీకాలు ఇస్తున్న సిబ్బంది

బలిజిపేట: మనుషులకు ప్రాణాంతక వ్యాధులు సోకినట్లు పశువులకు కూడా వ్యాధులు సోకి ప్రబలుతుంటాయి. వాటిని ముందుగానే గుర్తించి చికిత్స చేయించకపోయినా, నియంత్రించకపోయినా పశువులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. పాడిరైతులు, పశుపోషకులు మూగజీవాలకు సోకే ప్రాణాంతక వ్యాధులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. మూగజీవాలు ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలి. సకాలంలో టీకాలు వేయించి మూగజీవాల ప్రాణాలను కాపాడుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులు ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేస్తున్నారు.

మార్చి 30వరకు టీకాలు

జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మార్చి ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా పశువులకు టీకాలు వేస్తున్నారు. పశువులకు ప్రాణాంతకమైన గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వంటి వ్యాధులు సోకుండా ముందుగానే పశుపోషకుల ఇంటి వద్దనే టీకాలు వేస్తున్నారు. మూగజీవాల వివరాలు సేకరించి వెటర్నరీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి టీకాలు వేస్తున్నారు. బలిజిపేట మండలంలో గేదెలు 550, ఆవులు, ఎద్దులు 18,500, మేకలు 9,200, గొర్రెలు 25,600 వరకు ఉన్నాయి.

గాలికుంటు వ్యాధితో అనర్థాలు

గాలికుంటు వ్యాధి బారిన పడిన పశువుల్లో తీవ్రమైన జ్వరం, నీరసం, నోటి నుంచి తీగల్లా చొంగ, నోరు, కాలి గిట్టల మధ్య పుండ్లు, రొప్పడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అదేవిధంగా పాల ఉత్పత్తి, పని సామర్థ్యం గణనీయంగా తగ్గిపోవడం, పాలు తాగే దూడల్లో మరణాలు, వైద్యం నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోవడం వంటి నష్టాలు ఉంటాయి. అందుచేత నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకూ కచ్చితంగా టీకా వేయించాలి. సంవత్సరంలో రెండు పర్యాయాలు టీకాలు వేయించాలి. నాలుగు నెలలు దాటిన తరువాత తొలిసారి వ్యాక్సిన్ వేసిన పశువులకు నెలరోజుల తరువాత అవే పశువులకు బూస్టర్ డోస్ వేయించాలి. బూస్టర్ డోస్ ఏప్రిల్ 1వ తేదీ నుంచి 30తేదీ వరకు వేయనున్నారు.

పాడి పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి



2030నాటికి పూర్తిగా వ్యాధిని నిరోధించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రతి రైతు పశువులకు టీకాలు వేయించాలి. పశువుల పనిసామర్థ్యానికి, పాల దిగుబడి తగ్గకుండా ఉండేందుకు రైతులకు టీకాలు వేయించడం తప్పనిసరి.

– గణేష్, మండల పశువైద్యాధికారి, బలిజిపేట మండలం

చికిత్స లేని బ్రూసెల్లోసిస్

నివారణ తప్ప, చికిత్స లేని వ్యాధి బ్రూసెల్లోసిస్. దీన్ని నివారించేందుకు ఉన్న ఒకే ఒక్క మార్గం టీకా. ఈ వ్యాధి సోకిన పశువుల్లో జ్వరం, బలహీనత, చూడి ఆఖరి దశలో గర్భస్రావం, మాయ వేయకపోవడం, మగ పశువుల్లో వృషణాల వాపులు, కీళ్ల వాపు, వంధత్వం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధి సోకిన పశువుల గర్భస్రావాలు, మాయ, పాల ద్వారా ఇతర జంతువులకు వ్యాపిస్తుంది. వ్యాధి సోకిన పశువుల నుంచి మనుషులకూ సోకుతుంది. వ్యాధిని నియంత్రించేందుకు మూడు విడతలుగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. 4–8నెలల వయస్సు ఉన్న పెయ్యి దూడలకు తప్పనిసరిగా టీకాలు వేయాలి. పాలను ఎప్పుడూ మరిగించి వినియోగించుకోవాలి. వ్యాధిగ్రస్త పశువు మిగిల్చిన మేత, గర్భస్రావ మట్టు, మాయ, పిండాలను గొయ్యి తీసి పూడ్చిపెట్టాలి.

పోషకాహారం ఎంతో అవసరం


అంగన్వాడీ కేంద్రంలో పోషకాహారాన్ని పరిశీలిస్తున్న సీడీపీఓ సులేఖ, వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి

బలిజిపేట: అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పోషకాహారం ఎంతో అవసరమని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు దీనివల్ల ఎంతో మేలు జరుగుతుందని సీడీ పీఓ సులేఖ అన్నారు. ఈ మేరకు బలిజిపేటలోని అంగన్వాడీ కేంద్రంలో పోషకాహర స్టాల్‌ను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులకు అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి నెలా అందిస్తున్న ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని, అదే విదంగా వైద్యసేవలు చేయించుకోవాలని సూచించారు. బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి మాట్లాడుతూ కేంద్రాల వద్ద పోషకాహారాన్ని అందిస్తున్నారని, వైద్యసేవల నిమిత్తం గ్రామాల్లో వైద్యసిబ్బంది ఎప్పటికప్పుడు అవసరమైన సేవలు అందిస్తున్నారని తెలిపారు. మంచి ఆహారం తీసుకోవడం వల్ల మీకు, మీలో పెరుగుతున్న చిన్నారికి మేలు జరుగుతుందని, రక్తహీనత లేకుండా ఆరోగ్యం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

యోగా, ధ్యానంతో ఎంతో ఆరోగ్యం


పీహెచ్‌సీలో యోగాచేస్తున్న వైద్యాధికారిణి, సిబ్బంది

బలిజిపేట: యోగా, ధ్యానం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, అందులో మహిళలకు శారీరక అనారోగ్య సమస్యలు దూరంగా ఉంటాయని బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి తెలిపారు. ఈనెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బలిజిపేట పీహెచ్‌సీలో హెల్దీ ఉమెన్–హ్యాపీ ఉమెన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఎంతో ఆరోగ్యవంతంగా ఉండాలని పిలుపునిచ్చారు. మహిళల్లో ఎన్నో రకాల శారీరక మార్పులు సంభవిస్తాయని వాటివల్ల మానసికంగా ఒత్తిడికి గురవుతారని అందువలన యోగా, ధ్యానం చేస్తే శారీరక, మానసిక ఒత్తిళ్ల నుంచి బయటపడవచ్చని తెలిపారు. మహిళా సాధికారిత సాధించేందుకు ప్రతి మహిళ కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ సులేఖ, సిబ్బంది పాల్గొన్నారు.

గాదె విజయం ప్రభుత్వానికి గుణపాఠం


బలిజిపేట ఉన్నత పాఠశాలలో కేక్ కట్‌చేస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

- ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయరావు

బలిజిపేట: పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్(1938), మిత్ర సంఘాలు బలపరిచిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు(పీఆర్‌టీయూ) విజయం ప్రభుత్వానికి గుణపాఠమని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పువ్వల ధనుంజయరావు అన్నారు. ఎమ్మెల్సీగా గెలుపొందిన గాదె శ్రీనివాసులు నాయుడు విజయోత్సవ సంబరాలను బలిజిపేట ఉన్నత పాఠశాల వద్ద లంచ్ అవర్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరం అహర్నిశలు కష్టపడి శ్రీనివాసులునాయుడు విజయానికి కృషిచేశామన్నారు. ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా బెదరకుండా, తలొగ్గకుండా సిద్ధాతాలకు కట్టుబడి గెలిపించినందుకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం నుంచి ప్రభుత్వం గుణపాఠం నేర్చుకోవాలని సూచించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రస్తుత ప్రభుత్వం ఏమీ చేయకుండానే ఒక అభ్యర్థికి మద్దతు ప్రకటించడం, దానిని ఉపాధ్యాయులు తిరస్కరించడం అనే దాన్ని గమనించి ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను చెల్లించాలని, ఐఆర్‌ను ప్రకటించాలని, బకాయిపడిన డీఏలు, అందజేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమాన్ని విస్మరిస్తే పుట్టగతులుండవని హెచ్చరించారు. తక్షణమే తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్, పీఆర్‌టీయూ, మిత్రసంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డాక్టర్ రాధాకాంత్ సేవలు చిరస్మరణీయం


సన్మాన సభలో మాట్లాడుతున్న వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు

సీతానగరం: మండలంలోని మారుమూల గ్రామాల రోగులకు పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్ రాధాకాంత్ అందించిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్మోహనరావు, డాక్టర్ ఎం.వినోద్ కుమార్ ప్రశంసించారు. మండలంలోని పెదంకలాం పీహెచ్‌సీ నుంచి ఉన్నత వైద్యవిద్యనభ్యసించడానికి వెళ్తున్న డాక్టర్ రాధాకాంత్‌కు స్థానిక వైద్య సిబ్బంది, అధికారులు మంగళవారం ఏర్పాటు చేసిన సన్మానసభకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఉష, డాక్టర్ పావని, డాక్టర్ రమ్య, డాక్టర్ శిరీష, ఈఓ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహిళాదినోత్సవ ర్యాలీ



మహిళా దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ పి.పావని, డాక్టర్ ఉష

సీతానగరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలకేంద్రంలో డాక్టర్ పి.పావని ఆధ్వర్యంలో వైద్యారోగ్యశాఖ ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు ఆశ కార్యకర్తలు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు పీహెచ్‌సీ డాక్టర్ పి.పావని, డాక్టర్ పి.ఉష మాట్లాడుతూ మహిళలు విద్యాపరంగా, సామాజిక సేకార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం అభినందనీయమన్నారు.

మహిళల హక్కులు, విధులు విధానాలపై మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న హక్కులను వినియోగించుకుని మహిళలు మరిన్ని సేవలు అందించి తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని కోరారు. పీహెచ్‌సీ నుంచి మార్కెట్ వరకూ నిర్వహించిన మహిళలంతా ఐకమత్యంతో మెలగాలని, హక్కులను వినియోగించు కోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

పార్వతీపురం రూరల్: సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పార్వతీపురం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ యు. నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం పార్వతీపురం మండలంలో సి–కేటగిరికి చెందిన అడారు గ్రామంలో సారా నిర్మూలనపై గ్రామ యువతకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా విక్రయాలు జరుగుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సారా, మత్తు పదార్థాలు అరికట్టేందుకు నవోదయం కార్యక్రమం ద్వారా సారా తయారీకి ఉపయోగించే ముడి సరుకుల విక్రయం చేయకుండా సమావేశాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇటీవల దాడుల్లో సంగంవలసలో 20లీటర్ల సారాతో పట్టుబడిన ఎస్.సింహాచలం అనే వ్యక్తిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పర్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పనులు వేగవంతంగా జరిపించాలి


చెరువుగట్టుపై నాటిన కొబ్బరి మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వరూప రాణి

మక్కువ: ఉపాధి హామీ నిధులతో మండలంలో చేపట్టిన పనులను వేగవంతంగా జరిపించాలని ఎంపీడీవో డీడీ స్వరూప రాణి అన్నారు. ఈ మేరకు మండలంలోని మర్కొండపుట్టి పంచాయతీ పెదగైశీల గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డును ఎంపీడీవో స్వరూపరాణి మంగళవారం పరిశీలించారు. అలాగే తెలగడవలస గ్రామంలో ఉపాధి నిధులతో జరుగుతున్న సోక్‌పిట్ నిర్మాణం, పణుకుబందపై పెంపకం చేపడుతున్న కొబ్బరి మొక్కల ప్లాంటేషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మండల ఇంజినీరింగ్ అధికారి బి.రంజిత్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్ అప్పారావు పాల్గొన్నారు.

6న రాధాకృష్ణ మందిర ప్రతిష్ట


ఊరేగింపులో తప్పెటగుళ్ల ప్రదర్శన

పార్వతీపురం: పట్టణంలోని రైతు బజారు సమీపంలో శ్రీ గోపాలకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీగణపతి సహిత శ్రీ రాధాకృష్ణ మందిర ప్రతిష్ట మహోత్సవాన్ని ఈనెల 6న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అందులో భాగంగా మంగళవారం విగ్రహాలకు తిరువీధి, విఘ్నేశ్వరపూజ, రక్షాబంధనం, అఖండ దీపారాధన, విగ్రహాలకు జలాదివాసం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా తప్పెటగుళ్ల, కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి విగ్రహాలను ఊరేగించారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో సూర్య నమస్కారాలు, లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలు తదితర పూజా కార్యక్రమాలు చేసిన అనంతరం గురువారం రాధాకృష్ణ విగ్రహాల ప్రాణప్రతిష్ట నిర్వహించనున్నామన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.


కోలాటం చేస్తున్న మహిళా బృందం

గుర్ల గెడ్డ రిజర్వాయర్ పూర్తికి నిధులు కేటాయించండి

మెంటాడ: గుర్ల గెడ్డ రిజర్వాయర్ పూర్తికి నిధులు కేటాయించాలని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. ఇదే విషయమై మండల కేంద్రంలో మంగళవారం జరిగిన అఖిల పక్ష సమావేశంలో ఆయన కాసేపు ప్రసంగించారు. 1998లో అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న ప్రస్తుత సీఎం చంద్రబాబే గుర్ల గెడ్డ ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. అప్పటి నుంచి ఆ నిర్మాణాన్ని అలానే వదిలేశారని, నిర్మాణాన్ని పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై ఉన్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రాజెక్టు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ చలుమూరి వెంకటరావు, వైఎస్సార్ సీపీ అర్గనైజింగ్ కార్యదర్శి రెడ్డిరాజు అప్పలనాయుడు, టీడీపీ నాయకుడు గొర్లె ముసలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డ్రోన్‌తో గాలింపు


మరికి పరిసరాల్లో డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న ఆపరేటర్, ఎస్సై సంతోషి

పార్వతీపురం రూరల్: ఇటీవల కాలంలో వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నిందితులను పట్టుకునేందుకు ముమ్మరంగా మారుమూల ప్రాంతాల్లో గాలిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం పార్వతీపురం మండలంలోని అడ్డాపుశీల, వెలగవలస, ములగ, మరికి ప్రాంతాల్లో పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి ఆధ్వర్యంలో డ్రోన్ ఆపరేటర్‌తో గాలింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ, నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాల్లో ఒంటరిగా వెళ్తున్న మహిళలను, బస్సు కోసం వేచి ఉన్న మహిళలను, పొలం పనులు చేసే ఒంటరిగా ఉన్న మహిళలనే లక్ష్యంగా చేసుకుని గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని పట్టుకునేందుకు ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి ఆదేశాల మేరకు డ్రోన్‌తో గాలిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కొత్త వారు సంచరిస్తే తక్షణం పోలీసులకు సమాచారాన్ని అందించాలని కోరారు.

ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి

6న చలో విజయవాడ


బలిజిపేట: అరసాడ పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు


సాలూరు: వైద్యులకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు, ఆశవర్కర్లు

సాలూరు: ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి ఈ నెల 6న చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టినట్లు ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) నాయకురాళ్లు తెలిపారు.ఈ మేరకు మంగళవారం సాలూరు మండలంలోని తోణాం, మామిడిపల్లి, బాగువలస పీహెచ్‌సీలలో వైద్యాధికారులకు వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గతంలో తాము ధర్నా చేసినప్పుడు అధికారులు కొన్ని హామీలు ఇచ్చారని, ఆ హామీలను జీఓ రూపంలో ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, పనిభారం తగ్గించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, వేతనంతో కూడిన మెటర్నిటి లీవ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పై సమస్యల పరిష్కారానికి యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ నెల 6న చోలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మరియమ్మ, రమణమ్మ, సరోజిని, ఆదిలక్ష్మి, శ్రీను, ఎన్‌వైనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

బలిజిపేట: ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, ఈనెల 6న విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర ధర్నాను విజయవంతం చేయాలని బలిజిపేట మండల ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు లక్ష్మి కోరారు. ఈ మేరకు బలిజిపేట, అరసాడ, గలావల్లి పీహెచ్‌సీల వైద్యాధికారులకు వినతి పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు పాల్గొన్నారు.